సాక్షి
జోగులాంబ గద్వాల
బుధవారం ၊ 17 ၊ సెప్టెంబర్ ၊ 2025



## ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం

- కత్తులు, కర్రలే ఆయుధాలుగా ఆర్యసమాజ్ పోరాటం
- మతమార్పిడికి వ్యతిరేకంగా కదనరంగంలోకి..
- 1944లో నారాయణపేటలో భారీ ర్యాలీ
- సుండికే వారి ఇంటి నుంచే రజాకార్ల పాలన -8లో ▸



# సాయుధ పోరాటంలో.. పాలమూరు మట్టిబిడ్డలు

### నిజాం గుండెల్లో రణభేరి మోగించిన వీరులు

- వీరులతల్లి అప్పంపల్లిలో నెత్తుటి తర్పణం
- నైజాం సర్కారును ఎదురించిన అయిజ రైతులు
- మక్తల్, నారాయణపేటలోనూ ఉద్యమ ఆనవాళ్లు

**నిజాం రజాకార్లు ఊళ్ల మీద పడి దోచుకుంటున్న సమయమది.. వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది.. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో ఊళ్లన్నీ ఏకమయ్యాయి. బాంచన్ దొర నీ కాల్మొక్తా.. అని కట్టుకున్న చేతులు ఒక్కసారిగా ఆయుధాలు అందుకున్నాయి. మరికొందరు కారం పొడి, చేతి కర్రలు, బరిసెలనే ఆయుధాలుగా చేసుకుని నిరంకుశ నిజాం గూండాలతో ఎదురొడ్డిన పోరాటంలో ఎందరో నేలకొరగగా.. మరెందరో ప్రాణాలతో బతికి బయటపడ్డారు. చివరికి నైజాం సర్కారును మట్టి కరిపించి స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నారు. పాలమూరు జిల్లా మొదటిసారి నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతులు సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టారు. నాటి ఉద్యమం ఎంతో స్ఫూర్తి నింపింది.**

### తల్లడిల్లిన అప్పంపల్లి

చిన్నచింతకుంట: ఆ ఊరి పొలిమేరలోకి అడుగుపెట్టగానే మాయని గాయమేదో బాధపెడుతుంది.. పల్లెలోకి పాదం మోపగానే ఉద్వేగక్షణాలేవో తట్టిలేపుతాయి.. ఆ గ్రామం పేరు చూడగానే అమరుల త్యాగాలు యాదికొస్తవి. నేటికీ సాక్ష్యంగా మిగిలిన రావి చెట్టు, నాటి ఘటనను గుర్తు చేసి మనసును కకావికలం చేస్తుంది.. ఆ కిటికీ నుంచి కాల్పుల శబ్దాలు విని పించినట్లుగానే ఉంటుంది.. రజాకార్ల రాక్షస క్రీడ గుర్తుకొచ్చి రక్తం సలసలా మరుగుతుంది.. వారి బూటు కాళ్ల చప్పుళ్లు.. పోరాట ఘట్టాలు కథలు కథలుగా వినిపిస్తాయి. చిందిన అమరుల రక్తం.. స్తూపమై మొలిచి వారి త్యాగాలను గుర్తు చేస్తూ జాతీయ పతాకాన్ని చేతబట్టి ఉద్యమ స్ఫూర్తిని నింపుతుంది.. తొలుస్తున్న గాయాని దిగమింగుకుని.. వీరులను గుర్తించని వైనాన్ని తలుచుకుని.. దుఃఖిస్తోంది అప్పంపల్లి గ్రామం..


అప్పంపల్లిలో అమరవీరుల త్యాగాలకు సాక్షిగా నిలిచిన రావిచెట్టు

### అమర వీరులకు గుర్తింపేది?

రజాకార్లపై తిరుగుబాటు బావుటా ఎగరవేసి ప్రాణాలు కోల్పోయిన అప్పంపల్లి అమర వీరులను స్వాతంత్య్ర సమరయోధులుగా గుర్తింపునకు నోచుకోలేకపోయారు. స్వాతంత్య్ర పోరాటం.. నిజాం వ్యతిరేక పోరాటం వేర్వేరు అని భావించిన ప్రభుత్వ వైఖరి ఏమిటో ఎవరికీ అంతుచిక్కడంలేదు. ఒకవైపు స్వాతంత్రోద్యమంలో పాలుపంచుకుంటూ.. మరోవైపు నిజాం పోలీసు మూకలు సాగించిన అరాచకాలను ఎదురించి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి. దుర్భర స్థితిలో ఉన్న అప్పంపల్లి అమరవీరుల కుటుంబాలను ఆదుకున్నప్పుడే తెలంగాణ విమోచన దినోత్సవానికి నిజమైన సార్థకత లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


ఉద్యమకారులు: బెల్లం నాగన్న, తాళం బాలప్ప, మాల కిష్టన్న, తెలుగు ఆశన్న, తంగెడి గంగన్న, ఈడ్గి బాల్‌రాం, భీంరెడ్డి

### నాయకత్వం వహించాడు..



మా తండ్రి బెల్లం నాగన్న తెలంగాణ ఉద్యమ నాయకుడిగా నాయకత్వం వహించి నిజాం పోలీసుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాడు. నిజాం పాలనకు ఎదురుతిరిగాడు. అందుకు మా తండ్రిని పట్టుకోవడానికి గ్రామానికి వచ్చి గ్రామస్తులపై కాల్పులకు పాల్పడటంతో 11 మంది వీరమరణం పొందారు. ఉద్యమ సమయంలో మాకున్న వంద ఎకరాల భూమిని మా తండ్రి అమ్మేశాడు.

– అంజన్న, ఉద్యమకారుని కుమారుడు, అప్పంపల్లి

### పోరాటంలో ఎంతో పాత్ర..



తెలంగాణ పోరాటంలో గ్రామ నాయకుల పాత్ర ఎంతో ఉంది. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా ఎదురుతిరిగిన వీరులు బెల్లం నాగన్న, ఈడిగి బలరాంగౌడ్, తెలుగు ఆశన్న, దాసర్‌పల్లి బుచ్చారెడ్డి, ఆత్మకూర్ సంస్థానంపై జాతీయ జెండా ఎగరవేశారు. దీంతో ఉద్యమకారులను పట్టుకోవడానికి పోలీసులు మా ఊరికి వచ్చారు. సాయంత్రం సమయంలో చూస్తుండగానే రావి చెట్టు కింద పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కాల్పులకు గాయాలై ఆర్తనాదాలు చేశారు.

– సాయిలు, రిటైర్డ్ టీచర్, అప్పంపల్లి

### ఉద్యమానికి ఊపిరి..

ఆత్మకూర్ పల్లెల్లో రాజుకున్న చైతన్యం పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. 1947 అక్టోబర్ 7న భారీ ప్రదర్శనను అడ్డుకోవడంలో విఫలమైన పోలీసులు మహబూబ్‌నగర్ నుంచి అదనపు పోలీసు బలగాలను అప్పంపల్లికి తరలించారు. ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న బెల్లం నాగన్న, బలరాంగౌడ్, తంగెడి నాగిరెడ్డి, తెలుగు ఆశన్నలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఏక్షణంలోనైనా తమ నేతలను అరెస్టు చేస్తారని భావించిన అప్పంపల్లి గ్రామస్తులు రావిచెట్టు కింద గుమిగూడి చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన పోలీసులు భాష్పావాయువు ప్రయోగించారు. విడిది చేసిన ఇంటి కిటికీలో నుంచి ఉద్యమకారులపై కాల్పులు జరిపారు. ఈ క్రమంలో 11 మంది చాకలి కుర్మయ్య, ఈశ్వరయ్య, తంగేటి రాంరెడ్డి, నన్నేమ్మ, హరిజన్ కిష్టన్న, హరిజన్ తిమ్మన్న, లక్ష్మారెడ్డి, పెండేం సాయన్న, గజ్జలన్న, బాల్‌రెడ్డి, వడ్డేమాన్ నర్సయ్య అక్కడికక్కడే నేలకొరగగా.. భీంరెడ్డి, మాల కిష్టన్న, ఈడిగి తిమ్మక్క, పెండెం కుర్మన్న, కె.రామచంద్రయ్య, వాగుల గంగన్నతోపాటు మరో 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 29 మందిపై పోలీసులు చార్జ్‌షీట్ వేసి జైలులో నిర్బంధించారు.


అప్పంపల్లిలో అమరవీరుల పేర్లతో ఏర్పాటుచేసిన శిలాఫలకం

### అయిజలో లెవి సహాయ నిరాకరణోద్యమం

అయిజ: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటాల పురిటిగడ్డగా అయిజ నిలిచింది. ఇక్కడే లెవి సహాయ నిరాకరణోద్యమానికి బీజం పడింది. 1947 డిసెంబర్ 12న నిజాం నవాబు ప్రవేశపెట్టిన లెవి పన్నుకు వ్యతిరేకంగా అయిజ గ్రామ రైతులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసేందుకు సిద్ధపడ్డారు. ఈ పోరాటాన్ని అణచివేసేందుకు నిజాం నవాబులు జరిపిన కాల్పుల్లో రైతులు నాయకి చిన్న తిమ్మప్ప, కల్లె బీచుగాడు, కొండాపురం నర్సప్ప, పాగుంట వెకటయ్య, బలిజ నాగయ్య వీర మరణం పొందారు. నిజాం నవాబుల దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేందుకు ఎంతో మంది పోరాటయోధులు తమ ప్రాణాలను పణంగా పెట్టారు.

**స్మరించుకోని పాలకులు..**

నైజాం నవాబుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరులను నేటి పాలకులు స్మరించుకోకపోవడం దురదృష్టకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆనాటి అమరవీరులకు గుర్తుగా 1955లో అయిజలో స్తూపాన్ని నిర్మించారు. 1999లో ఆ స్తూపాన్ని ఆధునీకరించి.. గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించే సమయాల్లోనూ నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరులను స్మరించుకోకపోవడం శోచనీయం.


లెవి సహాయ నిరాకరణోద్యమం సందర్భంగా గ్రామస్తులు సమావేశమైన ఆలయం (ఫైల్)

## న్యూస్‌రీల్

### ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కేసులు



అలంపూర్: ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. మంగళవారం అలంపూర్ చౌరస్తాలో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సాయిశృతి, వినోద్‌రెడ్డి, సంజయ్, దినేశ్ వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు స్కూళ్లకు చెందిన 21 బస్సులను తనిఖీ చేశారు. వాటిలో ఫిట్‌నెస్, ధ్రువ పత్రాలు సరిగ్గా లేని 9 బస్సులపై కేసులు నమోదు చేశారు. అదే విధంగా పత్రాలు సరిగ్గా లేని ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో స్కూల్ బస్సులపై ప్రత్యేక నిఘా ఉంచామని.. ఫిట్‌నెస్ లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### గుర్రంగడ్డ పాఠశాలలో వలంటీర్ల నియామకం



గద్వాల: మండలంలోని గుర్రంగడ్డ ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు విద్యావలంటీర్లను కేటాయించారు. పాఠశాల ఉపాధ్యాయుడు పదోన్నతిపై మల్దకల్ మండలానికి వెళ్లడం.. ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను ఎవరిని నియమించకపోవడంతో సోమవారం పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ సంతోష్.. సమస్య పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా సెక్టోరియల్ అధికారి హంపయ్య, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ గుర్రగడ్డ పాఠశాలకు పడవలో బయలుదేరి వెళ్లారు. పాఠశాల విద్యార్థులకు తరగతులు బోధించేందుకు గాను ఇద్దరు విద్యావలంటీర్లను నియమించారు. త్వరలోనే ఉపాధ్యాయ ఖాళీని భర్తీ చేస్తామని.. అంత వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### వేరుశనగ క్వింటాల్ రూ.4,110

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు మంగళవారం 159 క్వింటాళ్ల విక్రయానికి వచ్చింది. క్వింటాల్ గరిష్ఠంగా రూ. 4,110, కనిష్ఠంగా రూ. 2,719 ధరలు లభించాయి. అదే విధంగా 56 క్వింటాళ్ల ఆముదాలు విక్రయానికి రాగా.. గరిష్ఠంగా రూ. 6,059, కనిష్ఠంగా రూ. 5,539, సరాసరి రూ. 6059 ధరలు వచ్చాయి.

### వైద్యసేవలను వినియోగించుకోవాలి



ఎర్రవల్లి: దీర్ఘకాలంగా వివిధ రోగాల బారినపడి ఇబ్బందులు పడుతున్న వారు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలను వినియోగించుకోవాలని జిల్లా టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాదిక్ అన్నారు. మంగళవారం మండలంలోని పుటాన్‌దొడ్డి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఇటిక్యాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 66 మందికి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో ఐదుగురు టీబీ, మరో 11మంది ఇతర వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వ్యాధు ల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి.. మందులను పంపిణీ చేశారు. అనంతరం టీబీ ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం నోడల్ పర్సన్ ప్రభాకర్, శ్రీనివాసులు, ఎస్టీఎస్ విజయ్ పాల్గొన్నారు.

# పండ్లతోటల సాగు.. భలే బాగు


కేటీదొడ్డి శివారులో సాగుచేసిన మామిడి తోట

- నడిగడ్డలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- తోటల పెంపకానికి ఇక్కడి నేలలు, వాతావరణం అనుకూలం
- ఏటా రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి

గద్వాల వ్యవసాయం: నడిగడ్డలో పండ్ల తోటల సాగు ఏటేటా పెరుగుతోంది. నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో పాటు ఇక్కడి నేలలు, వాతావరణ పరిస్థితులు తోటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. దీంతో ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. గడిచిన ఆరేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఏటా పండ్లతోటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని చెప్పవచ్చు..

**అనువైన పరిస్థితులు..**

పండ్లతోటలకు జిల్లాలో అనువైన పరిస్థితులు ఉన్నాయి. పండ్లతోటలు, కూరగాయల సాగుకు ఒండ్రుతో కూడిన ఎర్రటి నేలలు ఉండాలి. నడిగడ్డలో ఇలాంటి నేలల శాతమే ఎక్కువగా ఉంది. సాగునీటి విషయానికి వస్తే జూరాల, ఆర్డీఎస్ ప్రాజెక్ట్‌లతో పాటు నెట్టెంపాడు ఎత్తిపోతల, రిజర్వాయర్లు, నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. వీటన్నింటి ఫలితంగా బోరుబావుల్లో ఆశించిన స్థాయిలో నీరు ఉంటోంది. సాధారణంగా పండ్లతోటలను బోరుబావుల కిందే సాగు చేస్తారు. ఇక వాతావరణ విషయానికొస్తే వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు ఎంత ఉన్నా.. సాయంత్రం నుంచి రాత్రి వరకు చల్లగా ఉంటుంది. శీతాకాలంలో ఎంత చలి ఉన్నా.. ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోవు. ఇలా నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

**అవగాహన కరువు..**

ఆయా సీజన్‌లలో పండ్ల తోటలకు రకరకాల తెగుళ్లు ఆశించి.. దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యానశాఖ తగిన సలహాలు, సూచనలు అందించి.. రైతులను అప్రమత్తం చేయాలి. దీంతో పాటు మార్కెటింగ్ మెళకువలు తెలియక చాలా మంది రైతులు మధ్యవర్తులకు పండ్లను విక్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలాంటి వాటిపై అవగాహన సదస్సులు నిర్వహించి.. రైతులకు మెళకువలు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**2020-21 నుంచి పండ్లతోటల సాగు ఇలా (ఎకరాల్లో)..**

| సంవత్సరం | రైతుల సంఖ్య | సాగు |
|---|---|---|
| 2020-21 | 2,594 | 9,315 |
| 2021-22 | 3,354 | 11,106 |
| 2022-23 | 3,930 | 12,337 |
| 2023-24 | 4,390 | 13,568 |
| 2024-25 | 4,936 | 14,939 |
| 2025-26 | 5,118 | 15,332 (ఇప్పటివరకు) |

### మారిన ఆలోచనా సరళి..

జిల్లాలో పత్తి, వరి, వేరుశనగ తదితర పంటలను ఏళ్ల తరబడి సాగుచేస్తూ వస్తున్న రైతుల ఆలోచనా సరళిలో మార్పు వస్తోంది. ప్రధానంగా పండ్లతోటలకు ఇక్కడి నేలలు, వాతావరణం అనుకూలంగా ఉండటం.. మూడేళ్ల నుంచి ఐదేళ్ల పాటు మంచి నిర్వహణ పద్ధతులు అవలంబిస్తే దిగుబడి బాగా వచ్చి ఆర్థికంగా లాభపడతామన్న ఆలోచనతో రైతులు పండ్ల తోటలపై ఆసక్తి చూపుతున్నారు. మామిడి, బత్తాయి, పొప్పాయి, అంజీర, జామ, డ్రాగన్‌ఫ్రూట్ తదితర తోటలు సాగుచేస్తున్నారు. కాగా, పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెరగడానికి మరో కారణం కూడా ఉంది. కేంద్ర ఆధీనంలోని ఎంఐడీహెచ్ పథకంతో పాటు, ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల సాగుకు ప్రోత్సాహకం అందిస్తున్నారు. ఆయా పథకాలతో సన్న, చిన్నకారు రైతులు సైతం పండ్లతోటల సాగుపై మొగ్గుచూపుతున్నారు. 2020–21లో జిల్లావ్యాప్తంగా 9,315 ఎకరాల్లో పండ్ల తోటలు ఉండగా.. ఈఏడాది (2025–26) ఇప్పటివరకు 15,332 ఎకరాలకు పండ్లతోటల సాగు విస్తీర్ణం పెరిగింది.

### రైతులను ప్రోత్సహిస్తున్నాం..



పండ్లతోటలకు ఇక్కడి నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. పండ్ల తోటల సాగుకు ముందుకొచ్చే రైతులను ఉద్యానశాఖ పరంగా ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వ పథకాలకు అర్హులైన రైతులను గుర్తించి, వారికి ప్రోత్సాహకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. పండ్లతోటల రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు క్రమం తప్పకుండా అందేలా చర్యలు తీసుకుంటాం.

– ఎంఏ అక్బర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

## అన్ని సౌకర్యాలతో ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటు


ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: విద్యార్థులు, యువత భవిష్యత్ కోసం డిజిటల్ లైబ్రరీ, స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ భవనంలో తాత్కాలిక డిజిటల్ లైబ్రరీ, స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా బీఎస్ఎన్ఎల్ కార్యాలయ భవనంలో డిజిటల్ లైబ్రరీ, గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులన్నీ పర్యవేక్షించి కేంద్రాన్ని త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డిజిటల్ లైబ్రరీతో విద్యార్థులు పుస్తకాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్ తరగతులు, పోటీ పరీక్షలకు అవసరమైన సదుపాయాలతో పాటు వివిధ కోర్సులకు సన్నద్ధమయ్యేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గిరిజన హక్కుల సాధనకు అలుపెరగని పోరాటం


సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించిన నాయకులు

గద్వాలన్యూటౌన్: లంబాడీ, గిరిజన హక్కుల సాధన కోసం సేవాలాల్ సేన అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి మూడావత్ కృష్ణనాయక్, అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు అన్నారు. మంగళవారం సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రాజీవ్ సర్కిల్ సమీపంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంత్‌శ్రీ తపస్వీ రామారావు మహరాజ్ చేతుల మీదుగా సేవాలాల్ సేన ఆవిర్భవించిందని చెప్పారు. రాష్ట్రంలో లంబాడీ, గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై అనేక పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. లంబాడీ, గిరిజనుల్లో రాజకీయ చైతన్యం రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మూడావత్ రవి నాయక్, ఉపాధ్యక్షుడు నెనావత్ రవినాయక్, నర్సింహులు, రేఖానాయక్, పాత్లావత్ రవి నాయక్, ధాన్య నాయక్, నరేంద్రనాయక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం తప్పని తిప్పలు


ఎర్రవల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఎర్రవల్లి: వానాకాలంలో వరి, చెరుకు, వేరుశనగ, పత్తి తదితర పంటలు సాగుచేసిన రైతులకు యూరియా లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పీఏసీఎస్‌లు, ఇతర ఎరువుల విక్రయ కేంద్రాలకు చేరుకొని గంటల తరబడి నిరీక్షించినా రెండు బస్తాల యూరియా లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మంగళవారం వివిధ గ్రామాల రైతులు ఎర్రవల్లి సింగిల్‌విండో కార్యాలయానికి తెల్లవారుజామునే చేరుకొని యూరియా కోసం క్యూ కట్టారు. కొందరు తమ పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులను క్యూలైన్‌లో పెట్టి నిరీక్షించారు. యూరియా కొరత కారణంగా పస్తులుండి పడిగాపులు కాయాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సరిపడా యూరియాను అందించాలని కోరారు.

## వీరభద్రా.. మంగళం



మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో వీరభద్రస్వామి అగ్నిగుండ మహోత్సవం మంగళవారం తెల్లవారుజామున వైభవంగా జరిగింది.

వివరాలు 8లో..

# ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం


ర్యాలీలో పాల్గొన్న జనం (ఫైల్)


రాంచందర్‌రావు కల్యాణి

- కత్తులు కర్రలే ఆయుధాలుగా ఆర్యసమాజ్ పోరాటం
- మతమార్పిడికి వ్యతిరేకంగా కదనరంగంలోకి
- 1944లో నారాయణపేటలో భారీ ర్యాలీ
- సుండికే వారి ఇంటి నుంచే రజాకార్ల పాలన

నారాయణపేట: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పాలమూరు ప్రజలు సాగించిన పోరులో నారాయణపేట ఆర్యసమాజ్ కీలకపాత్ర పోషించింది. 1947–49 కాలంలో కర్రలు, కత్తులే ప్రధాన ఆయుధాలుగా ఉద్యమాలు కొనసాగించారు. రజాకార్లు ఉద్యమ నేతలను తుపాకులతో కాల్చి చంపడంతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఉమ్మడి పాలమూరులో ఎంతోమంది పోరాట యోధులను జైలుకు పంపి ఉద్యమాన్ని అణిచివేసే ప్రయత్నం చేశారు. 1948 సంవత్సరానికి ముందు జిల్లాలో నిజాం పాలనకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు జరిగా యి. ప్రజల్లో వచ్చిన చైతన్యంతో నిజాం పాలకులు ఈ ప్రాంతాన్ని విడిచి వెళ్లినట్లు ప్రచారం జరు గుతోంది.

**ఖాసీం రజ్వీ పాలనలో..**

అప్పట్లో ఖాసీం రజ్వీ అనే రజాకారు నారాయణ పేట ప్రాంతంలో ఓ బృందాన్ని ఏర్పాటు చేసుకొని మతమార్పిడి చేసేందుకు పూనుకోవడంతో ఉద్యమాలు జరిగినట్లు పెద్దలు చెబుతున్నారు. మొదట్లో మతమార్పిడి కొంతమేర జరిగినా.. తర్వాతి కాలంలో ఉద్యమకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆర్యసమాజ్ నేతృత్వంలో పెద్దఎత్తున పోరాటాలు చేశారు. కాలక్రమేణ స్వాతంత్ర్యం కోసం రజాకర్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధమయ్యారు. తమ వద్ద పదునైన ఆయుధాలు లేకపోవడంతో కత్తి, కర్ర సాములో యువతకు ప్రత్యేక శిక్షణనిచ్చి తీర్చిదిద్దారు.

**యజ్ఞంతో ఏకం చేస్తూ..**

ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో తృతీయ మహాసభల పేరిట గ్రామీణ ప్రాంతాల్లో యజ్ఞం పేరుతో అందరిని ఒకే వేదికపైకి తీసుకొస్తూ ఉద్యమాలు కొనసాగించారు. ఆ సమయంలో ఆర్యసమాజ్ సభలు, సమావేశాలు నిర్వహించేందుకు నిజాం పాలకులు అనుమతినిచ్చే వారు కాదు. లోక కల్యాణార్థం మహారాష్ట్రాలోని సోలాపూర్ ఆర్యసమాజ్ కేంద్రంగా గ్రామాల్లో ప్రత్యేకంగా యజ్ఞాలు నిర్వహిస్తున్నట్లు నిజాం పాలకులను నమ్మించడంలో సఫలీకృతులయ్యారు. యజ్ఞాల పేరిట ప్రజలను ఒకచోట చేర్చి అవసరమైన ప్రణాళికలు రూపొందించారు.

**సుండికే వారి ఇంటి నుంచే పాలన..**

నారాయణపేట దర్గా రోడ్‌లోని సుండికే వారి ఇంటి నుంచే రజాకార్లు పాలన సాగించినట్లు పెద్దలు చెబుతున్నారు. ఇక్కడే ఉంటూ తమకు వ్యతిరేకంగా ఎవరు ఉద్యమించినా అక్కడికి తీసుకెళ్లి శిక్షించే వారన్నారు. ప్రాణాలను లెక్కచేయక జైలులో ఉండి అనారోగ్యానికి గురైనట్లు తెలిపారు.

**వేలాదిగా తరలివచ్చిన యువత..**

1944లో నిజాం పాలనకు వ్యతిరేకంగా నారాయణపేటలో హైదరాబాద్‌కు చెందిన సూరజ్ చంద్రోజీ, పండిత్ నరేంద్రజీ, నారాయణపేటకు చెందిన రాంచందర్‌రావు కల్యాణి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. ర్యాలీ అనంతరం స్థానిక శాతవాహనకాలనీ ప్రాంతంలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఉద్యమకారులు ప్రతిపాదించారు. ర్యాలీకి నిజాం పాలకులు అనుమతి ఇవ్వకపోవడంతో మొదట్లో అంతంత మాత్రంగా వచ్చిన జనం తర్వాత కట్టలు తెగిన ఉత్సాహంతో తరలివచ్చి నిజాం పాలకులకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేశారు.

## మన్ననూర్‌లో కాలాపాని జైలు

సాక్షి, నాగర్‌కర్నూల్: నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిని శిక్షించేందుకు నల్లమలలోని మన్ననూరులో కాలపాని జైలు ఏర్పాటయ్యింది. స్వాతంత్ర్య సమరయోధులు, సాయుధ పోరాటయోధులను దండించేందుకు 1905లో ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రత్యేకంగా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని జైలు ఏర్పాటు చేసిన కాలపాని జైలు ఆనాటి చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. నిజాం కాలంలో ఉద్యమకారులను ఇక్కడికి తీసుకువచ్చి చిత్రహింసలకు గురిచేసేవారు. అయితే జైలు భవనానికి వంద అడుగుల దూరంలోనే జైలు బావి ఉండేది. దట్టమైన నల్లమల అడవిలోని ఈ బావి నీటిని తాగి బందీగా ఉన్నవారు తీవ్ర అనారోగ్యానికి గురై.. మరణించేవారు. ఈ క్రమంలోనే దీనికి కాలాపాని జైలుగా పేరు వచ్చింది.

**పండిత్ నరేంద్రజీ ఇక్కడే..**

నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆర్యసమాజ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన పండింత్ నరేంద్రజీ మన్ననూరు జైలులోనే బందీ అయ్యారు. 1938లో ఆయన్ను నిజాం బంధించి 17 నెలల 21 రోజులపాటు శిక్షించారు. అనంతర కాలంలో మన్ననూరు జైలును నరేంద్రజీ స్మారకంగా గుర్తించారు. ఆర్య ప్రతినిధి సభ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2004 సెప్టెంబర్ 17న కాలపాని జైలు ప్రాంగణంలో నరేంద్రజీ స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేశారు. చారిత్రక ఘటనకు సాక్ష్యంగా నిలిచిన కాలాపాని జైలు చరిత్రను నేటి తరాలకు తెలిసేలా ప్రభుత్వం దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.



### ఉత్సవాలు జరపాలి..



నిజాం కాలంలో వందలాది మందిని బందీలుగా తీసుకువచ్చి నాటి కాలాపాని జైలులో ఉంచేవారు. నాటి చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న జైలుఖానాపై ప్రభుత్వం దృష్టిపెట్టి స్మారకంగా అభివృద్ధి చేయాలి. సెప్టెంబర్ 17న అధికారికంగా జైలు ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహించాలి.

– సంబు వెంకటరమణ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్

### నేటి తరానికి తెలిసేలా..



నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని మన్ననూర్ జైలులో శిక్షించారు. ఇక్కడి కాలా పాని నీళ్లు తాగితే సచ్చిపోతారని ఉద్యమకారులను భయపెట్టేవారు. జైలు చరిత్రను నేటి తరానికి తెలిసేలా, వెలుగులోకి తెచ్చేలా అభివృద్ధి చేయాలి.

– తుమ్మల నారాయణరెడ్డి, మన్ననూర్

### వరంగల్ జైలులో 50 రోజులు ఉన్నా..



నవాబుపేట: సాయుధ పోరాటంలో విద్యార్థిదశ నుంచే ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నా. తరగతిగదిలో సైతం తెలంగాణ విషయంలో ఎక్కువగా వాదిస్తే అణచివేత ఉండేది. రాజాకార్ల సైన్యం ప్రయాణించే బస్సును నిలిపివేసి దహనం చేశాం. ఈ ఘటనలో నాతో పాటు చాలా మందిపై కేసులు నమోదు చేశారు. వారం పాటు వెతికి చివరకు అరె స్టు చేశారు. 50 రోజుల పాటు వరంగల్ జైలులో ఉన్నా. అనంతరం బెయిల్‌పై వచ్చినా ఉద్యమ పంథా వీడలేదు. నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి పొందిన సమయంలో నాకు 27 ఏళ్లు. అప్పటి సంతోషం, సంబురం చెప్పలేనివి.

– రంగారావు, నవాబుపేట

## నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన రాఘవేందర్‌రావు



మక్తల్: భారతదేశంలో విలీనం చేసేందుకు ఏ డో ని జాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఒప్పుకోకపోవడంతో బానిస సంకెళ్ల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించేందుకు అప్పట్లో మక్తల్ నియోజకవర్గంలో ఉన్న నారాయణపేటకు చెందిన న్యాయవాది రాఘవేందర్‌రావు పోరాటం సాగించారు. నిజాం వ్యతిరేక పోరాటానికి అప్పటి కాంగ్రెస్‌పార్టీ పిలుపునివ్వడంతో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 300 మంది స్వాతంత్ర్య సమరయోధులు ముందుకురాగా.. వారికి రాఘవేందర్‌రావు నాయకత్వం వహించారు. ఆయన తన అనుచరులతో పోలీస్‌స్టేషన్లపై దాడులు, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, ఆయుధాలు ఎత్తుకెళ్లడంతో పాటు భూమి పన్ను చెల్లించరాదని ప్రజలకు పిలుపునిచ్చారు. రాఘవేందర్‌రావును పట్టుకుంటే 5 వేల ఉస్మానియా చిక్కా నజరానా ఇస్తామని నిజాం పాలకులు ప్రకటించారు. అయినా చిక్కకపోవడంతో ఆయన తమ్ముడు శ్రీనివాసరావును అరెస్టు చేసి జైలులో బంధించారు. అప్పటి నుంచి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన రాఘవేందర్‌రావు పనితీరును పలువురు అభినందించారు. ప్రాణాలను లెక్కచేయకుండా రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. పేటలోనే ఉమ్మడి జిల్లా 4వ సదస్సు నిర్వహించారు. 1999, మే 22న రాఘవేందర్‌రావు మృతిచెందారు.

## జక్లేర్‌కు చెందిన కిషన్‌రావు, శ్రీనివాసరావు, ఉత్తం వెంకప్ప సైతం..


శ్రీనివాసరావు


కిషన్‌రావు

రజాకార్లు గ్రామాల్లో మహిళలపై చేస్తున్న ఆకృత్యాలు, ఇళ్లలో చేస్తున్న దోపిడీలను సహించలేక జక్లేర్‌కు చెందిన కిషన్‌రావు, శ్రీనివాసరావు, ఉత్తం వెంకప్ప తిరుగుబాటు చేయడంతో వారిని బంధించి గుల్బర్గ జైలుకు తరలించారు. 1947, ఆగస్టు నుంచి 1948, జూన్ వరకు సుమారు 11 నెలలు జైలులోనే ఉండగా.. విడుదలైన తర్వాత ఆదోని క్యాంపునకు తరలించారు. 1952 తర్వాత జక్లేర్ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ జెండా ఎగురవేసి 3 రోజుల పాటు 5వ మహాసభలు నిర్వహించారు.

## క్లుప్తంగా

### బైక్ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం

మిడ్జిల్: బైక్ అదుపు తప్పి కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని కొత్తపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మిడ్జిల్ మండలంలోని చిల్వేర్‌కు చెందిన జక్కా అనిల్‌కుమార్(30) పనిమీద జడ్చర్లకు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ కొత్తపల్లి సమీపంలో అదుపుతప్పి రోడ్డుపైన నిలిచి ఉన్న బొలేరోను ఢీకొట్టడంతో బలమైన గాయాలలై అక్కడికక్కడె మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయడు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని రాజపేట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

### డ్రంకెన్‌డ్రైవ్‌లో లారీ డ్రైవర్‌కు జైలుశిక్ష



మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన లారీ డ్రైవర్‌కు న్యాయమూర్తి జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌ఐ శీనయ్య ఆధ్వర్యంలో చేసిన డ్రంకన్‌డ్రైవ్‌లో లారీ డ్రైవర్ బెస్త మహేశ్ మద్యం తాగి లారీ నడుపుతున్నట్లు గుర్తించారు. అతనికి బ్రీత్ అనలైజర్ ద్వారా చేసిన పరీక్షల్లో ఏకంగా 550శాతం ఆల్కహాల్ తాగినట్లు నిర్ధారణ కావడంతో మంగళవారం కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి నిర్మల లారీ డ్రైవర్ మహేశ్‌కు రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధించారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు సదరు వ్యక్తిని జిల్లా జైలుకు తరలించారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

కేటీదొడ్డి: ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి చోరీ చేసిన ఘటన మండలంలోని చింతలకుంట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుడిసె ఆంజనేయులు మంగవారం ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. సాయంత్రం పనులు ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండాటాన్ని గమనించాడు. బీరువా పగులకొట్టి రెండు తులాలున్నార బంగారం, వెండి, నగదు చోరీ జరిగినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆత్మకూర్: మండలపరిధిలోని జూరాల గ్రామ శివారులోని కృష్ణనది ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మంగళవారం మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా మృతదేహం కనిపించడంతో సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో దాదాపు 10 నుంచి 15 రోజుల క్రితం వరదనీటిలో కొట్టుకు వచ్చి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఆనవాళ్లు తెలసిన వారు ఎవరైనా ఉంటే ఆత్మకూర్ పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

### డీసీఎం బైక్ ఢీ: యువకుడికి గాయాలు

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలోని గోవర్ధనగిరి రహదారిలో మంగళవారం సాయంత్రం డీసీఎం, బైక్ ఢీకొన్న ఘటనలో బొల్లారానికి చెందిన కుందేళ్ల నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. కొల్లాపూర్ నుంచి పెబ్బేర్‌కు వెళ్తున్న డీసీఎం పల్లె ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఫొటోగ్రాఫర్ నాగరాజు మోకాలికి బలమైన గాయం కావడంతో 108లో పెబ్బేరు ఆస్పత్రికి తరలించారు.

### లారీ, కారు ఢీ

వనపర్తి రూరల్: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలైన సంఘటన పెబ్బేరు మండలంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన అన్నపురెడ్డి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి బెంగుళూర్‌కు బయలు దేరాడు. మార్గమధ్యలో పెబ్బేరు మండలంలోని జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని సడన్ బ్రేక్ వేయడంతో వెనుకాల వస్తున్న కారు లారీని ఢీకొట్టింది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో డ్రైవింగ్ చేస్తున్న సతీష్ చంద్ర, పక్క సీటులో కూర్చున్న యశ్వంత్ చంద్రకు రక్తగాయాలయ్యాయి. బాధితుడు అన్నపురెడ్డి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

# వీరభద్రా.. మంగళం

- మన్యంకొండలో వైభవంగా అగ్నిగుండ మహోత్సవం
- ముగిసిన వీరభద్రస్వామి ఉత్సవం


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఉన్న శ్రీవీరభద్రస్వామి అగ్నిగుండం కార్యక్రమం మంగళవారం తెల్లవారుజామున వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా దేవస్థానం ఎదుట అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి సంకీర్తనలు ఆలపిస్తూ నందికోళ సేవ చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహంతో దేవస్థానం నుంచి సమీపంలోని కోనేరులో ప్రత్యేక పూజలు చేశారు. తిరిగి స్వామిని దేవస్థానం ఎదుట ఉన్న అగ్నిగుండం ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అగ్నిగుండంపై నడిచి భక్తిని చాటుకున్నారు. అనంతరం అగ్ని గుండానికి మహా మంగళహారతి పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో వినూత్న తీర్పు


మహబూబ్‌నగర్‌లోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రాఘవేందర్

మహబూబ్‌నగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారుడికి న్యాయమూర్తి వినూత్నంగా శిక్ష విధించారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు గత నెల 24న జిల్లాకేంద్రం సమీపంలోని బోయపల్లి మార్గంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన రాఘవేందర్ మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. ఈ కేసులో మంగళవారం వాహనదారుడు రాఘవేందర్‌ను కోర్టులో హాజరుపరచగా 2వ తరగతి కోర్టు స్పెషల్ న్యాయమూర్తి డి.నిర్మల వాహనదారుడికి రెండు రోజుల సామాజిక సేవతోపాటు రూ.2 వేల జరిమానా విధించారు. సామాజిక సేవలో భాగంగా మద్యం తాగి వాహనాలు నడిపితే వచ్చే అనర్థాలపై ప్లకార్డులు పట్టుకొని ప్రధాన కూడళ్లలో వాహనదారులకు అవగాహన కల్పించాలని తీర్పు చెప్పారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు రాఘవేందర్‌తో జిల్లాకేంద్రంలోని సుభాష్‌చంద్రబోస్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శింపజేశారు.

# సమయాన్ని వృథా చేసుకోవద్దు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీ మల్లు రవి తదితరులు

నాగర్‌కర్నూల్: విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దని ఎంపీ మల్లురవి అన్నారు. పట్టణంలోని ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో సీఎస్ఆర్ నిధులతో ఎస్‌బీఐ బ్యాంక్ సౌజన్యంతో రూ.6.70 లక్షలతో నిర్మించిన మూత్రశాలలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్టోర్ రూం, మెనూ చార్టు పరిశీలించారు. ఎంపీకి ఆహార నాణ్యతపై వివరాలను ప్రిన్సిపాల్ వివరించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఎంపీ సహపంక్తి భోజనం చేస్తూ వారితో ముచ్చటించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఎంపీ వివరించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. అందుకు అనుగుణంగానే మెస్ చార్జీలను 40 శాతం పెంచిందన్నారు. విద్యాభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఈ దృష్టితోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. స్థానికంగా ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఉమ్మడి జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు మామిళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌మూర్తి, బ్యాంక్ అధికారులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధనౌక, తెలంగాణ ఉద్యమ కారుడు గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాల విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహ ఏర్పాటు కమిటీ కన్వీనర్ గోపాల్, కో కన్వీనర్లు కృష్ణముదిరాజ్, మైత్రియాదయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు గద్దర్ సాంస్కృతి ఉద్యమాన్ని నిర్మించారని తెలిపారు. అలాంటి వ్యక్తి ఆశయాలు భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. భావితరాలకు పరిచయం చేయడం కోసం జిల్లా కేంద్రంలో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కోకన్వీనర్లు ప్రవీన్, గోపాల్, రవికిరన్, మురళి, చందుయాదవ్, శ్రీనివాస్, శ్రీను, వెంకట్‌స్వామి, సంజీవ్, తిరుపతయ్య, రామలింగం పాల్గొన్నారు.

## పీయూ ఈసీ హెచ్‌ఓడీగా రామరాజు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నూతనంగా ప్రారంభించిన ఇంజినీరింగ్ కళాశాల హెచ్‌ఓడీగా పండగ రామరాజు నియమిస్తూ వీసీ శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రామరాజు మాస్టర్ డిగ్రీ ఓయూ నుంచి, పీహెచ్‌డీ బిట్స్ పిలానీ, ఐఐటీ మద్రాస్‌లో పోస్టు డాక్టోరల్ ఫెల్లోషిప్‌ను పూర్తి చేసి, పీయూలో ఇటీవల అధ్యాపకుడిగా చేరారు. హెచ్‌ఓడీగా నియమించినందుకు వీసీకి రామరాజు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్ పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు ఆహ్వానం..**

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో వచ్చే నెల 16న నిర్వహించే స్నాతకోత్సవ కార్యక్రమానికి రావాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరకు వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఆహ్వాన పత్రిక అందజేశారు.

## వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



తెలకపల్లి: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అజమోని వెంకటేష్ (31) చేపల వ్యాపారంలో నష్టపోయాడు. ఈ నెల 13న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లాడు. ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో అతని తల్లి అజమోని తిరుపతమ్మ ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# జూరాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో


జూరాల ప్రాజెక్టు 12 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

- ప్రాజెక్టు 12 క్రస్టు గేట్ల ఎత్తివేత
- ఆరు యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు 1.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం రాత్రి 8.30 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 1,18,500 క్యూసెక్కులకు తగ్గినట్లు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 12 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 83,484 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల్లో ఒక పంప్‌ను ప్రారంభించి నీటిని ఎత్తిపోస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తునట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. విద్యుదుద్పత్తి కోసం 37,008, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 46, భీమా లిఫ్టు–1కు 650, ఎడమ కాల్వకు 550, కుడి కాల్వకు 490, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,22,978 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.531 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు.

**నిరంతరాయంగా విద్యుదుత్పత్తి**

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్నాటక నుంచి వరద భారీగా చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు మంగళవారం 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 334.026 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 359.114 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 693.140 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు పేర్కొన్నారు.

## కోయిల్‌సాగర్‌లో 32.3 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం మంగళవారం సాయంత్రం వరకు 32.3 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. కేవలం 0.3 అడుగుల మేర తక్కువగా ఉంది. వారం రోజులుగా ప్రాజెక్టుకు వచ్చే పెద్దవాగు ప్రవాహం తగ్గడంతో ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. దీంతో అధికారులు ప్రాజెక్టు గేట్లను మూసి వేశారు.

# విద్యుత్ కార్మికుల పక్షాన పోరాడుతాం

- 1104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా


నూతనంగా ఎన్నికైన 1104 కమిటీ సభ్యులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్) : విద్యుత్ కార్మికుల పక్షాన యూనియన్లు నిరంతరం పోరాటం చేయాలని విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా అన్నారు. మంగళవారం స్థానిక జేజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో విద్యుత్ ఎంప్లాయీస్ 1104 సర్కిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన వారి తరపున పోరాటం చేయాలన్నారు. కార్మికుల హక్కులను కాపాడిన నాడే యూనియన్లకు మనుగడ ఉంటుందన్నారు. విద్యుత్‌శాఖ ఉద్యోగులు, కార్మికులకు తాము అండగా ఉంటామని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏ సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికైన నూతన అధ్యక్ష కార్యదర్శులు కార్మికుల సమస్యలు తెలుసుకుని ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకోగా జిల్లా అధ్యక్షుడిగా స్వామి, జిల్లా కార్యదర్శిగా పాండు, అదనపు కార్యదర్శిగా సోమేష్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, టీజీఎస్పీడీసీఎల్ డిస్కం అదనపు కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వెంకన్న, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.